వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 297
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
సెప్టెంబర్ 06, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## ఎన్పీడీసీఎల్ అసోసియేషన్ కంపెనీ సెక్రటరీగా దిలీప్ కుమార్



వరంగల్ ఉమ్మడి జిల్లా తొర్రూర్ ప్రాంతానికి చెందిన మడిపెద్ది దిలీప్ కుమార్ టీజీ ఎన్పీడీసీఎల్ ఏఈ కంపెనీ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈనెల రెండో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు కంపెనీల ఎన్నికలు నిర్వహించగా శుక్రవారం ప్రకటించిన ఎన్నికల ఫలితాలలో టీజీడీసీఎల్ కంపెనీ సెక్రటరీగా మడిపెద్ది దిలీప్ కుమార్ విజయం సాధించారు. దిలీప్ కుమార్ ప్రస్తుతం గొర్రెకుంట ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. వైస్ ప్రెసిడెంట్ గా ఏఈ నవీన్ జగిత్యాలలో, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ నవీన్ నయీమ్ నగర్ ఏఈగా ప్రస్తుతం పని చేస్తున్నారు. వీరికి ఏఈలు, అధికారులు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. **– వరంగల్ వాయిస్, హనుమకొండ**



# ఆలయాలకు మహార్దశ

**తూర్పులో ఆరు దేవాలయాల్లో అభివృద్ధి పనులు**

- రూ.4.35 కోట్ల కేటాయింపు
- శంకుస్థాపన చేసిన మంత్రి సురేఖ
- పాల్గొన్న కలెక్టర్, మేయర్

వివరాలు2లో..

రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ (తూర్పు) నియోజకవర్గంలోని ఆరు దేవాలయాల్లో రూ. 4.35 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేశాయిపేటలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో స్వామి వారి జన్మదినం సందర్భంగా నిర్వహించనున్న కోటి దీపోత్సవ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొని ఒత్తులు వెలిగించారు. అనంతరం సురేఖ మాట్లాడుతూ మట్టెవాడ భోగేశ్వర స్వామి దేవాలయం, దేశాయిపేట రంగనాయక స్వామి దేవాలయం, స్టేషన్ రోడ్డులోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, గోవిందరాజుల గుట్ట వద్ద ఆంజనేయ స్వామి దేవాలయం, కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వర రంగనాయక స్వామి దేవాలయం, అబ్బని కుంటలోని మహేశ్వరి దేవాలయాల నవీకరణ పనులకు శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. **- వరంగల్ వాయిస్, వరంగల్**






## డిజిటల్ రంగంలో అసమానతలు



8లో..

- స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న మహిళలు 35 శాతం మాత్రమే
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- గోవాలో డిజిటల్ లింగ భేదం, మహిళల ఆర్థికాభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్




8లో..

## సమస్యలపై తక్షణమే స్పందించాలి

- ఆదేశించిన సీపీ సన్ ప్రీత్ సింగ్
- పోలీస్ కంట్రోల్ రూం ఆకస్మిక సందర్శన

## రేపు సంపూర్ణ చంద్ర గ్రహణం మూతపడనున్న ఆలయాలు



8లో..










# ఆలయాలకు మహర్దశ

- తూర్పులో ఆరు దేవాలయాల్లో అభివృద్ధి పనులు
- రూ.4.35 కోట్ల కేటాయింపు
- శంకుస్థాపన చేసిన మంత్రి సురేఖ పాల్గొన్న కలెక్టర్, మేయర్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ప్రతి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఆరు దేవాలయాల్లో రూ. 4.35 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. తూర్పు నియోజకవర్గంలోని 18 దేవాలయాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించినప్పటికీ మొదటి విడతగా ఆరు దేవాలయాల అభివృద్ధి పనులను ప్రారంభించామన్నారు. మిగిలిన దేవాలయాల అభివృద్ధి పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు.





## దశల వారీగా..

వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని అన్ని ఆలయాలను దశలవారీగా అభివృద్ధి, నవీకరణ, పునరుద్ధరణ చేయడతామని మంత్రి సురేఖ హామీ ఇచ్చారు. కాతీయుల కాలం నాటి చారిత్రాత్మక దేవాలయాలు వరంగల్ లో అధికంగా ఉన్నందున వాటిని పునరుద్ధరణ చేసి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పురావస్తు, పర్యాటక శాఖలకు సంబంధించిన దేవాలయాలను కూడా అభివృద్ధి చేయుటకుగాను ఆయా శాఖల నుంచి అనుమతి కొరకు జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకుంటున్నారని ప్రకటించారు. పురావస్తు శాఖ వారి అనుమతి రాగానే ఆయా దేవాలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. దేవదాయ శాఖకు సంబంధించిన అన్ని దేవాలయాలకు, దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రిగా తాను నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

## ఆరు దేవాలయాల్లో అభివృద్ధి..

వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఆరు దేవాలయాల నవీకరణ పనులకు శనివారం మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. మట్టేవాడలోని పురాతన భోగేశ్వర స్వామి దేవాలయం, దేశాయిపేట రంగనాయక స్వామి దేవాలయం, స్టేషన్ రోడ్డులోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, గోవిందరాజుల గుట్ట కింద ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయం, కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వర రంగనాయక స్వామి దేవాలయం, అబ్బని కుంటలోని మహేశ్వరి దేవాలయాల నవీకరణ పనులకు శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు.

## ఘన స్వాగతం..

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మేయర్ గుండు సుధారాణితో కలిసి దేవాదాయ శాఖ మంత్రి శనివారం తూర్పు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఆరు ఆలయాలకు చేరుకున్న మంత్రికి అర్చకులు, పాలక మండలి సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆయా దేవాలయాల్లో ఏర్పాటు చేసిన శంకుస్థాపన శిలాఫలకం వద్ద కొబ్బరికాయలు కొట్టారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి మహదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు రామ తేజస్వి శిరీష్, కావేటి కవిత, చింతాకుల అనిల్ కుమార్, ఓని స్వర్ణలత భాస్కర్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, ఎండోమెంట్ అధికారి సునీత, రాష్ట్ర దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ ఇ.శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి, అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత, ఈవో కిషన్ రావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కురుమిళ్ల సంపత్, భద్రకాళి ట్రస్ట్ బోర్డ్ మెంబర్స్ జారతి వెంకట్, తోగరు క్రాంతి సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.











# సీనియర్ సిటిజన్స్‌కు ఉచిత న్యాయ సేవలు

## ◆ జిల్లా జడ్జి డాక్టర్ కె. పట్టాభి రామారావు




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వృద్ధులకు న్యాయ సహాయం అందించేందుకు హనుమకొండ జిల్లా పరిషత్ ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ లో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఉచిత లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా జడ్జి డాక్టర్ కె. పట్టాభి రామారావు హాజరయ్యారు. సీనియర్ సిటిజన్స్‌కు ఎదురయ్యే న్యాయపరమైన సమస్యలకు ఉచిత సలహాలు, కేసులలో న్యాయవాదిని నియమించుకోలేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని జిల్లా జడ్జి డాక్టర్ పట్టాభి రామారావు తెలిపారు. వృద్ధుల సమస్యల పరిష్కారానికి ట్రిబ్యునల్ కోర్టు ఒక వరం వంటిదని, వయోవృద్ధులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని జడ్జి హెచ్చరించారు. తల్లిదండ్రుల బాధ్యత కచ్చితంగా పిల్లలదేనని, ఈ బాధ్యతను విస్మరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్, అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి వయోవృద్ధుల చట్టం గురించి, వారి హక్కుల గురించి వివరించారు. ఈ చట్టాలపై ప్రజల్లో సరైన అవగాహన లేదని, గ్రామ స్థాయి నుంచి నగర స్థాయి వరకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. వృద్ధాప్యం ఎవరికీ శాపంగా మారకూడదని, తమ హక్కులను తెలుసుకుని వినియోగించుకోవాలని అన్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ జడ్జి క్షమా దేష్ పాండే మాట్లాడుతూ అవసరమైన వారికి ఉచిత న్యాయ సేవలు అందిస్తామని, వృద్ధులను గౌరవించడం మన సంస్కారానికి నిదర్శనమని తెలిపారు. తల్లిదండ్రులను ప్రేమించనివారు ఎంతటి కోటీశ్వరులైనా దరిద్రులతో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి డాక్టర్ పట్టాభి రామారావు, డాక్టర్ అనితా రెడ్డి, క్షమా దేష్ పాండే, డీడబ్ల్యూఓ జయంతి, జూనియర్ జడ్జిలు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు యుగేందర్, దేవాచారి, దామోదర్, సరళ, వాణి, రవీందర్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# గడదాసు మణికంఠకు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** స్థానిక కుమార్‌పల్లిలోని సెంట్ జోసెఫ్ హైస్కూల్‌లో గురు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్, కరాటేలో శిక్షణ ఇస్తున్న కోచ్ గడదాసు మణికంఠను సత్కరించారు. విద్యార్థులను శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారు చేయడంలో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా, శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జయమేరీ, ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సన్మానం అనంతరం గడదాసు మణికంఠ మాట్లాడుతూ, పిల్లలకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇచ్చేందుకు ప్రోత్సహించిన పాఠశాల యాజమాన్యానికి, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్సాహంగా వినాయకుని లడ్డూ వేలంపాట

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నగరంలోని యాదవ్ నగర్, న్యూ రెడ్డి కాలనీలోని పీసీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ లో జరిగిన వినాయకుని లడ్డూ వేలంపాట ఘనంగా జరిగింది. తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న వినాయకుడి లడ్డూ మహాప్రసాదాన్ని సొంతం చేసుకోవడానికి భక్తులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ లడ్డూను గెలుచుకుంటే ఐశ్వర్యం, ఆరోగ్యం, సిరిసంపదలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ సంవత్సరం లడ్డూ వేలంలో రామప్ప ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ పేరుమీద వంశీకృష్ణ ఐలి రూ.5,816కు లడ్డూను దక్కించుకున్నారు. ఈ వేలంలో వంశీకృష్ణతో పాటు ఆయన మిత్రులు శివాజీ గూడేపు, సతీష్ తాబేటి కూడా పాల్గొన్నారు. చివరి వరకు కాగితాల ప్రవీణాచారి, కానుకుల సాయికిరణ్, అవుసుల సురేందర్ లు పోటీపడి, వేలాన్ని మరింత ఉత్సాహంగా మార్చారు. లడ్డూ వేలం అనంతరం, వినాయక నామస్మరణలతో, సాంప్రదాయ నృత్యాలతో, హర్షధ్వనుల మధ్య వినాయకుడిని సాగనంపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కమిటీ సభ్యులు తాబేటి రాజేందర్, ఐలు నరేందర్, గంగాధర యాదగిరి, కొలగాని రాజేందర్, నవీన్ వెల్పుల, అలుగువెల్లి నరేందర్ రెడ్డి, రఘు బొల్లపల్లి, ముస్కు కార్తీక్, శివరాజ్, శ్రీనివాస్, దిలీప్, రంజిత్, మహిళా భక్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని పులిగిల్ల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుల్యాల సంపత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కున్సోతు హనుమంతరావు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వేణుగోపాలస్వామి, పరకాల మండల నోడల్ ఆఫీసర్ సాంబయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్న ప్రధానోపాధ్యాయుడు పుల్యాల సంపత్ రెడ్డితో పాటు, సీనియర్ ఉపాధ్యాయులు కటుకోజ్వల సతీష్, ఉమా, పద్మ, కవిత, ప్రదీప్, రాజేష్ లను ఘనంగా సత్కరించారు. మండల విద్యాశాఖ అధికారి హనుమంతరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల నిబద్ధతతోనే నాణ్యమైన విద్య అంది దేశం పురోగమిస్తుందని పేర్కొన్నారు. పులిగిల్ల పాఠశాలకు జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ అవార్డులు రావడం గర్వకారణమని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పనిచేస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచుకుంటున్న ఈ పాఠశాలను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంపత్ రెడ్డి మాట్లాడుతూ, ఈ అవార్డు ఉపాధ్యాయులందరి సమిష్టి కృషికి లభించిన గౌరవమని, విద్యార్థుల సంఖ్య పెరగడానికి కారణం తమ ఉపాధ్యాయ బృందమేనని తెలిపారు. సీనియర్ ఉపాధ్యాయులు కటుకోజ్వల సతీష్ మాట్లాడుతూ, అన్ని వృత్తులను తయారు చేసేది ఉపాధ్యాయ వృత్తి అని, ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పబ్బ సరిత, అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, సూరమ్మ, సారమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం, మండల విద్యాధికారి హనుమంతరావు మరియు ఉపాధ్యాయులందరూ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

# గ్రేటర్ వరంగల్‌లో లడ్డు రికార్డు వేలం

## రూ. 2,07,000 లకు దక్కించుకున్న బైరి సూర్యాన్ష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీలోని 8వ డివిజన్‌లో సుభాష్ యూత్ గణపతి మండలి ఆధ్వర్యంలో జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో గత 42 సంవత్సరాల చరిత్రలోనే రికార్డు స్థాయిలో లడ్డు వేలం పలికింది. ఈసారి లడ్డు వేలం పాటలో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక ధర పలికింది. 51 కిలోల మహా లడ్డును రూ. 2,07,000/- (అక్షరాలా రెండు లక్షల ఏడు వేల రూపాయలు) కు బిడ్ చేశారు. ఈ లడ్డును 8వ డివిజన్ కార్పొరేటర్ బైరి లక్ష్మి కుమారి సాంబయ్య దంపతుల చిన్న కుమారుడు, హనుమకొండ బీజేపీ కార్యదర్శి బైరి శ్రవణ్ కుమార్, ఆయన సతీమణి లావణ్య తనయుడు బైరి సూర్యాన్ష్ సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జంగా ప్రభాకర్, కిరణ్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖులకు ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం



**వరంగల్ వాయిస్, పోచమ్మమైదాన్ :** వరంగల్‌లోని వాసవీ కాలనీలో ఇన్నర్ వీల్ క్లబ్ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు సన్మానం చేసింది. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మర్రి రేణుక అధ్యక్షత వహించారు. కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా, విద్యారంగంలో విశేష సేవలందించిన పైడిపల్లి స్కూల్ టీచర్ విజయరాణి, ఆరోగ్యరంగంలో పనిచేస్తున్న పర్వతగిరి పీహెచ్‌సీ ఉద్యోగి శారద, ప్రభుత్వ మ్యూజిక్ టీచర్ శేషమణి, న్యాయవాది నీరజ, ప్రజాహిత బ్రహ్మకుమారి వైష్ణవిరెడ్డి, ఎస్సై పరమేశ్వరిలకు సన్మానం చేసి, వారి సేవలను కొనియాడారు.అంతేకాకుండా, వైద్య, ఇంజినీరింగ్ రంగాల్లో ప్రతిభ కనబరిచిన పదిమంది పేద విద్యార్థినులకు తలా రూ. 10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేసి వారి ఉన్నత విద్యకు చేయూతనిచ్చారు. ఈ కార్యక్రమానికి ఫౌండర్ మెంబర్ నరెళ్ల శోభావతి, పాస్ట్ అసోసియేషన్ ట్రెజరర్ పద్మశర్మ, చీఫ్ గెస్ట్ టి. వెంకటేష్, పీడీసీ డా. కస్తూరి ప్రమీల, డిస్ట్రిక్ట్ ఎడిటర్ లక్ష్మి, డా. సంధ్యా రాణి, పాస్ట్ ప్రెసిడెంట్ లావణ్య, శ్రీలత వాణి తదితరులు హాజరయ్యారు.

# అచ్చ సుదర్శన్ కు ‘భారత మాత శిక్షక్ రత్న’ జాతీయ అవార్డు

**వరంగల్ వాయిస్, నడికూడ:** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ భారత మాత అభినందన్ సంఘటన (హర్యానా), కర్ణాటక యూనిట్ ద్వారా ‘భారత మాత శిక్షక్ రత్న’ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును శుక్రవారం సాయంత్రం ఆన్‌లైన్ కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా భారత మాత అభినందన సంఘటన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు పురుషోత్తం దాస్ మెటల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుంచి అచ్చ సుదర్శన్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గత 28 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న సుదర్శన్, తన వినూత్న బోధనా పద్ధతులు, సృజనాత్మక నైపుణ్యాలతో విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. విద్యా సామర్థ్యాలను మెరుగుపరచడంలో మరియు విద్యా రంగంలో సానుకూల మార్పులను తీసుకురావడంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డును అందించినట్లు తెలిపారు. ఈ ఆన్‌లైన్ కార్యక్రమంలో భారత మాత అభినందన సంఘటన కర్ణాటక అధ్యక్షులు






డాక్టర్ మలకప్ప అలియాస్ మహేష్, ‘బేటీ బచావో బేటీ పఢావో’ భారత ప్రభుత్వ అంబాసిడర్, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ డాక్టర్ ప్రశాంత్ కూడా పాల్గొన్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా అచ్చ సుదర్శన్‌ను మండల విద్యాశాఖ అధికారి కున్సోతు హనుమంతరావు, పాఠశాల ఉపాధ్యాయులు లకావత్ దేవా, కంచరాజు కుమార్, మేకల సత్యపాల్, అంగన్‌వాడీ టీచర్లు బీముడు లక్ష్మి, నందిపాటి సంధ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కందికట్ల రమ అభినందించారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శనివారం, సెప్టెంబర్ 06, 2025

# విజయవంతంగా గణేశ్ నిమజ్జనం

## ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన మామిండ్ల రాజు



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట:** గణేశ్ నిమజ్జనాన్ని విజయవంతం చేసినందుకు 31వ డివిజన్ ప్రజలకు, గణపతి మండపాల నిర్వాహకులకు డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. శనివారం కార్పొరేటర్ మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణపయ్యను నిమజ్జనానికి తరలిస్తున్న సమయంలో తాను పలు మండపాల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణపయ్యను కోరుకున్నట్లు తెలిపారు. అలాగే, నిమజ్జనంలో పాల్గొన్న ఆడపడుచులు, యువకులు, ప్రజలు, మండపాల నిర్వాహకులు ఎంతో సమయస్ఫూర్తితో వ్యవహరించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుని నిమజ్జనంను విజయవంతం చేసినందుకు మామిండ్ల రాజు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని నిట్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ అన్నారు. జేఎన్ఎస్‌లో శనివారం జరిగిన జిల్లా స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా సెలక్షన్స్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిర్వహించిన ఈ క్రీడా సెలక్షన్‌లకు మంచి స్పందన రావడం సంతోషకరమన్నారు. వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నప్పటికీ, క్రీడలపై మక్కువతో పోటీల్లో పాల్గొంటున్న ఉద్యోగులను అభినందించారు. ఉద్యోగులు ఒత్తిడికి గురికాకుండా ఇలాంటి పోటీల్లో పాల్గొనడం అవశ్యకమని సూచించారు. అనంతరం సెలక్షన్‌లకు హాజరైన ఉద్యోగులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా యువజన క్రీడా అధికారి గుగులోత్ అశోక్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ రవికుమార్ ఫిజికల్ ఎడ్యుకేషన్ లో ఉన్నత స్థాయికి ఎదిగి, పలువురు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా, డాక్టర్ రవికుమార్ డీఎస్ఏ ఆఫీసు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు, ఆఫీస్ సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఫొటో ట్రేడ్ ఎక్స్పోను విజయవంతం చేయాలి



**వరంగల్ వాయిస్, రేగొండ:** ఈ నెల హైదరాబాద్ లో జరగనున్న ఫొటో ట్రేడ్ ఎక్స్పో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బండ రగోతం రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రేగొండ మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షులు జంబుల రఘుపతి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో ఫొటో ఎక్స్పో పోస్టర్‌ను ఎస్సై రాజేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ నెల 19, 20, 21 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ఫొటోగ్రాఫర్లంతా తప్పకుండా హాజరు కావాలని కోరారు. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ వాటిలో వస్తున్న నూతన టెక్నాలజీ గురించి అవగాహన పెంపొందించేందుకు ఈ ఎక్స్పో ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొని నూతన టెక్నాలజీని నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాముల రాజు, జిల్లా కోశాధికారి ఏల్దండి రాకేష్, మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రాజేందర్ నాయక్, మండల కోశాధికారి బండి కమలాకర్, ఇతర ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిగ్రస్తులు పోషకాహారం తీసుకోవాలి

## ◆ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** టీబీ వ్యాధితో బాధపడుతున్న రోగులు చికిత్స సమయంలో మంచి పోషకాహారం తీసుకోవాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య సూచించారు. పోషకాహార కిట్‌లను అందించడానికి దాతలు ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శనివారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో మనుస్ హెల్పింగ్ హ్యాండ్ ఫర్ ఆర్ఫన్ చిల్డ్రన్ సంస్థ సహకారంతో 20 మంది టీబీ రోగులకు నిక్షయ్ పోషణ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ క్షయ వ్యాధి రోగులు సమయానికి మందులు వేసుకోవడంతో పాటు, చక్కటి పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం వల్ల త్వరగా కోలుకుంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ టి.మదన్ మోహన్ రావు, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ హిమబిందు, పీఓఎంహెచ్ఎన్ డాక్టర్ మంజుల, మాస్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, మనుస్ సంస్థ ప్రతినిధి మహేష్, జిల్లా టీబీ కోఆర్డినేటర్లు సుష్మ, నగేష్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ విజయ్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

## క్రీడాకారులకు కలెక్టర్ స్నేహ శబరీష్ అభినందన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాకు చెందిన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరచాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆకాంక్షించారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లోని పాలమూరు విశ్వవిద్యాలయంలో జరిగిన జూనియర్ స్టేట్ మీట్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన అండర్-16 బాలికల బృందాన్ని, అలాగే గుంటూరులో జరగనున్న సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన పదిమంది క్రీడాకారులను కలెక్టరేట్‌లో శనివారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడాకారుల ప్రతిభను ప్రశంసించారు. గుంటూరులో జరిగే పోటీల్లోనూ పతకాలు సాధించి జిల్లాకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాధికారి గుగులోతు అశోక్ కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కే. సారంగపాణి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, కోశాధికారి నాగ కిషన్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, రమేష్, నాగరాజుతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న గట్లకానిపర్తి జడ్పీఎస్ఎస్ పూర్వ విద్యార్థులు



**వరంగల్ వాయిస్, గట్లకానిపర్తి:** మానవత్వం చాటుకుంటూ గట్లకానిపర్తి జడ్పీఎస్ఎస్ పాఠశాల 2001-2002 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ స్నేహితురాలు కూస సుమలత కుటుంబాన్ని ఆదుకున్నారు. ఇటీవల అనారోగ్యం కారణంగా సుమలత తండ్రి కూస రాజిరెడ్డి మరణించడంతో, ఆ కుటుంబానికి తమ వంతు సహాయంగా రూ. 8,500 ఆర్థిక సాయం అందించారు. ఈ కష్ట సమయంలో తాము తోడుగా ఉంటామని పూర్వ విద్యార్థులు ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కోరే మహేందర్, బొమ్మకంటి కుమార్, రాజేందర్, నరేందర్, రాజు, నరేష్, చేన్నబోయిన సరిత, జున్నుతుల మౌనిక, సుజాత, వైనాల జ్యోతి, శైలజ, శ్రీదేవి, కవిత తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయులు ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారధులు



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి:** సమాజంలో పాత్రికేయులు ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిలా పనిచేస్తారని, ప్రపంచంలోని సమాచారాన్ని వార్తల ద్వారా అందించే పాత్రికేయుల కృషి అభినందనీయమని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్ రావు అన్నారు. వాసవి క్లబ్ వారోత్సవాల్లో భాగంగా, శనివారం హసన్ పర్తిలోని బాలాజీ గార్డెన్స్ లో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రావు మాట్లాడుతూ వార్తాపత్రికల ప్రాధాన్యతను నార్ల వెంకటేశ్వరరావు ఆనాడే వివరించారని గుర్తు చేశారు. దిన, వార, పక్ష, మాస, త్రైమాసిక, వార్షిక పత్రికలు ప్రజలకు విజ్ఞానాన్ని అందించడమే కాకుండా, లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. అనంతరం, స్థానిక విలేకరులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సంద్రు నాగేందర్, కోశాధికారి మాధవశంకర్, డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రెటరీ శంకర్, జోన్ ఛైర్మన్ సుధీర్, మాజీ అధ్యక్షులు మంచెన శ్యామ్ సుందర్, బెలిదె లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# 10న తెలంగాణ అస్తిత్వంపై రౌండ్ టేబుల్ సమావేశం



**వరంగల్ వాయిస్, కేయూ:** తెలంగాణ ప్రజలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్ఏ) జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎత్తూరి సాయికుమార్ పిలుపునిచ్చారు. ఈ నెల 10న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో జరగనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ గేటు వద్ద ఈ సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను డీఎస్ఏ, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సమావేశం తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి, వ్యాపారం, ఆర్థిక వ్యవస్థపై మార్వాడీల గుత్తాధిపత్యాన్ని వ్యతిరేకించే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్వాడీలు తెలంగాణ అస్తిత్వాన్ని కించపరుస్తూ, ఇక్కడి ఆర్థిక వనరులను దోచుకుంటూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై విషం కక్కుతున్నారని ఆరోపించారు. ఉత్తర భారతదేశ ఆచార వ్యవహారాలను ఇక్కడ ప్రజలపై రుద్దుతూ, మనువాద రాజకీయాలను పెంచి పోషిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా, తెలంగాణలో వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసుకుని, తమ వారికి మాత్రమే ఉద్యోగాలు ఇస్తున్నారని, నకిలీ సరుకుల దందాకు పాల్పడుతూ ప్రజలను దోపిడీ చేస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రజలను తాగుబోతులుగా చిత్రీకరిస్తూ వారి వ్యక్తిత్వాన్ని కించపరచడం సిగ్గుచేటని వారు తీవ్రంగా ఖండించారు. భవిష్యత్తులో తెలంగాణ ప్రజలపై, సంస్కృతిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నాయకులు శంకర్, బాలు, శేషిధర్, సంపత్, అభినయ్లతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రంగంలో విద్య, వైద్యం కొనసాగించాలి

◆ ఏఐఎఫ్‌డీఎస్ నాయకుల డిమాండ్



**వరంగల్ వాయిస్, నారాయణఖేడ్ :** విద్య, వైద్య రంగాలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్ (ఏఐఎఫ్ డీఎస్) ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి టి. కుమార్ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 11వ తేదీన సంగారెడ్డి టీఎన్‌జీవో భవన్‌లో జరగనున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ శాసనసభ్యులు అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ గారి శతజయంతి వార్షికోత్సవం సందర్భంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు టి. కుమార్ తెలిపారు. రాజ్యాంగం కల్పించిన విద్యా, వైద్య హక్కులను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన అన్నారు. కార్పొరేట్ విద్యా, వైద్య రంగాలను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ రంగాలపై సవతి తల్లి ప్రేమ చూపుతున్నాయని విమర్శించారు. చివరికి ముఖ్యమంత్రులు, మంత్రులే కార్పొరేట్ కళాశాలలను ప్రారంభిస్తున్నారని, దీనిపై విద్యార్థులు, యువత ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందడం లేదని, ఈ రంగాలపై ప్రజలకు హక్కులు లేకుండా పోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైద్యంతో పాటు సకల వర్గాల హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని యువజన, విద్యార్థి సంఘాలను కోరారు. తక్షణమే విద్య, వైద్య రంగాలను ప్రభుత్వ పరం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కమిటీ సభ్యులు అరుణ్, రవి, సురేష్, రాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, చిట్యాల:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా బాంబుల గడ్డ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాలువల సంజీవ్, కోడెపాక నరసయ్య కుటుంబాలను చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూట్ల తిరుపతి పరామర్శించారు. చిట్యాల మండలం, భావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన ఈ ఇద్దరు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మరణించగా, వారి కుటుంబాలను గూట్ల తిరుపతి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భావుసింగ్‌పల్లి కాంగ్రెస్ నాయకులు నంద రాజు, ఐలయ్య, భీమ్ రావు, తిరుపతి రావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పత్తి పంటలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి



**వరంగల్ వాయిస్, దామెర :** పులుకుర్తి గ్రామంలోని ప్రత్తి పంటలను పరిశీలించిన వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) రామకృష్ణ, రసం పీల్చే పురుగులు, పిండినల్లి ఉధృతిని గమనించి, రైతులు తక్షణమే సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కాశెట్టి వేణు, అంకేశ్వరపు రాంబాబు, దండు లక్ష్మయ్య, ముంద్రాతి సీతారాములు తదితరులు పాల్గొన్నారు. పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఏఈఓ రామకృష్ణ సూచించారు. పురుగు మందులు, వాటి మోతాదు గురించి వివరించారు. రసం పీల్చే పురుగులు పచ్చ దోమ నివారణకు (ఎకరానికి) మోనోక్రోటోఫాస్ 36% SL (మోనోఫాస్) – 400 మి.లీ, థయోమిథాక్సామ్ 25% డబ్ల్యూజీ (వకోర్) – 100 గ్రా + వేప నూనె 1500 పీపీఎం, ఇమిడాక్లోప్రిడ్ 70 డబ్ల్యూడీజీ (గ్రిండ్) – 35 గ్రా + వేప నూనె 1500 పీపీఎం, ఎసిఫేట్ 50శాతం +ఇమిడాక్లోప్రిడ్ 1.8శాతం (లాన్సర్ గోల్డ్) – 600–800 గ్రా + వేప నూనె 1500 పీపీఎం, తెల్ల దోమ నివారణకు (ఎకరానికి): అసిటామిప్రిడ్ 20% ఎస్ పీ (ఫెలిక్స్) – 100 గ్రా + వేప నూనె 1500 పీపీఎం, ప్రొఫెనోఫాస్ 50శాతం ఈసీ (హెక్సానోవా) – 400 మి.లీ, ట్రైజోఫాస్ 40శాతం ఈసీ (క్రాంతి) – 400 మి.లీ, బైఫెన్త్రిన్ 40శాతం ఈసీ (డ్రాకన్) – 400 మి.లీ, డైఫెంథ్యురాన్ 50శాతం డబ్ల్యూపీ (పోలో) – 250 గ్రా, పిండినల్లి నివారణకు ఫెండాల్ ఫెన్‌థోయేట్ + డైక్లోరోవాస్ 76శాతం ఈసీ (ఫెండాల్ + పారామార్) – 200 మి.లీ + 800 మి.లీ, ప్రొఫెనోఫాస్ 50శాతం ఈసీ+ డైక్లోరోవాస్ 76శాతం ఈసీ (హెక్సానోవా + పారామార్) – 600 మి.లీ + 200 మి.లీ, మలథియాన్ 50శాతం ఈసీ+ డైక్లోరోవాస్ 76శాతం ఈసీ (మలమార్ + పారామార్) – 400 మి.లీ + 200 మి.లీ వాడాలని సూచించారు. రైతులు సూచనలను పాటిస్తూ, సస్య రక్షణ చర్యలు చేపట్టి తమ పంటలను కాపాడుకోవాలని ఏఈఓ రామకృష్ణ కోరారు.

# శ్రీవేద పాఠశాలలో గురుపూజోత్సవం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పెద్ద కొడపాక గ్రామంలోని శ్రీవేద పాఠశాలలో శనివారం గురుపూజోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో భారత మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, విద్యార్థులు తమ గురువులకు దుస్తులు బహూకరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృత, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బ్యాడ్జీలు అలంకరించి, స్వీట్లు పంపిణీ చేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రియాంక, కీర్తి రెడ్డి, వేద, సౌందర్యలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# పైండ్ల రఘుపతికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు




**వరంగల్ వాయిస్, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా శాయంపేట మండలం పెద్దకొడపాక గ్రామానికి చెందిన పైండ్ల రఘుపతి ఎంపికయ్యారు. గత 13 సంవత్సరాలుగా మొగులపల్లి మండలం, కొరికిశాల గ్రామంలో సాంఘిక శాస్త్రం పండితుడిగా ఆయన అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేల చేతుల మీదుగా రఘుపతి ఈ అవార్డును అందుకున్నారు. రఘుపతికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల ఆయన స్వగ్రామమైన పెద్దకొడపాక గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# సమాజ సేవలో డాక్టర్ అక్షిత

ప్రజా వైద్యురాలిగా అరుదైన గుర్తింపు

నేడు పుట్టిన రోజు జరుపుకుంటున్న అక్షిత



**వరంగల్ వాయిస్, సిరిసిల్ల :** ప్రజల కోసం బతకడమే నిజమైన త్యాగమని నమ్మే డాక్టర్ అక్షిత, తాను నేర్చుకున్న విద్యను సమాజ సేవకు ఉపయోగిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు పుట్టినరోజు జరుపుకుంటున్న ఈ యువ వైద్యురాలు, తన నిస్వార్థ సేవలతో 'ప్రజా వైద్యురాలిగా' అరుదైన గుర్తింపు పొందారు. నేడు ఆమె పుట్టిన రోజు జరుపుకుంటున్న అక్షిత తన సేవలను ప్రజల కోసమే అన్నట్లు జీవిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది చిన్నతనం నుంచే దైవభక్తి, సేవాభావం మెండుగా ఉన్న అక్షిత, తన కష్టంతో సొంత కాళ్లపై నిలబడాలనే లక్ష్యంతో పాటు, ఇతరులకు సాయం చేయాలనే దయార్ద్ర హృదయంతో ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారు. ఇదే ఆమెను 'పేదల డాక్టర్'గా నిలబెట్టింది. తన వైద్య పరిజ్ఞానాన్ని ప్రజారోగ్యం కోసం ఉపయోగిస్తూ, ఉన్నంతలో నలుగురికి సాయం చేయడంలోనే ఆమె నిజమైన సంతృప్తిని పొందుతున్నారు. బ్యాచిలర్ ఆఫ్ నాచురోపతి అండ్ యోగిక్ సైన్స్ (BNYS), ఆయుర్వేదంలో పట్టా పొందిన డాక్టర్ అక్షిత, ప్రత్యేక చికిత్సా విధానాలతో ప్రజల రోగాలను నయం చేస్తున్నారు. ఆమె కేవలం వైద్య సేవలకు మాత్రమే పరిమితం కాకుండా, డ్రగ్స్ మ్యానుఫ్యాక్చరింగ్లో కూడా పట్టా సాధించారు. అయినా, ఆమె ఇంకా నిత్య విద్యార్థిగా కొత్త కోర్సులను అభ్యసిస్తూ తన జ్ఞానాన్ని పెంచుకుంటున్నారు. ప్రజల అవసరాలను అర్థం చేసుకుంటూ, వారికి సాయం అందించడంలో అందెవేసిన చెయ్యిగా పేరు పొందిన డాక్టర్ అక్షితకు పుట్టినరోజు శుభాకాంక్షలు.

# మహిళలకు అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, చిట్యాల:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరీ ఆదేశాల మేరకు, చిట్యాల గ్రామంలోని జూనియర్ కళాశాల, మండల సమైక్య మీటింగ్‌లో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో జయశ్రీ ఆధ్వర్యంలో 'ఉమెన్ హబ్' (మహిళా సాధికారత కేంద్రం) సిబ్బంది అనూష, మమత ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా, మహిళా సాధికారత ఇంఛార్జి, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ అనూష మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ, విద్య కోసం కేంద్ర ప్రభుత్వం 'బేటీ బచావో, బేటీ పఢావో' పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. మొబైల్ ఫోన్ల వాడకం వల్ల కలిగే నష్టాలు, అలాగే ఆడపిల్లలపై పెరుగుతున్న లైంగిక వేధింపుల గురించి వివరించారు. ఫోక్సో చట్టం, సోషల్ మీడియా విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ముఖ్యంగా, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల్లో ఫోటోలు పెట్టడం వల్ల సైబర్ నేరగాళ్లు వాటిని మార్ఫింగ్ చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.మహిళల హక్కులు, సేవలు, బాల్య వివాహాలను అరికట్టడం, లింగ వివక్షత చూపకపోవడం, లింగ నిర్ధారణ చట్టం నేరం వంటి విషయాలను కూడా ఆమె ప్రస్తావించారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల చట్టం గురించి కూడా అవగాహన కల్పించారు. ఆపద సమయంలో ఉమెన్ హెల్ప్‌లైన్ (181), వృద్ధుల కోసం 14567, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 లను ఉపయోగించుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ జయప్రద పోషకాహారం ప్రాముఖ్యత గురించి వివరించగా, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి కళావతి పిల్లలకు సంబంధించిన చట్టాలను, ఆపద సమయంలో 1098 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీహెచ్ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ మమత, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఏపీఎం మంజుల, ఏడబ్ల్యూటీలు భాగ్యలక్ష్మి, జ్యోతి, లెక్చరర్లు, మహిళా సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, సెప్టెంబర్ 06, 2025

# 9న లంబాడీల ఆత్మగౌరవ మార్చ్

### గుగులోత్ రాజు నాయక్, అంగోత్ వినోద్ లోక్ నాయక్




**వరంగల్ వాయిస్, కేయూ:** లంబాడీలు ఎస్టీలు కాదని, అక్రమంగా రిజర్వేషన్లు అనుభవిస్తున్నారని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, మాజీ ఎంపీ సోయం బాపూరావు దాఖలు చేసిన పిటిషన్లను నిరసిస్తూ, ఈ నెల 9న హనుమకొండలో జరిగే లంబాడీల ఆత్మగౌరవ మార్చ్‌ను విజయవంతం చేయాలని లంబాడీ రిజర్వేషన్ పరిరక్షణ జేఏసీ రాష్ట్ర సమన్వయకర్తలు గుగులోత్ రాజు నాయక్, ఆంగోత్ వినోద్ లోక్ నాయక్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిజాం కాలం నుంచే లంబాడీలు ఎస్టీ జాబితాలో ఉన్నారని స్పష్టం చేశారు. రాజకీయ కుట్రలో భాగంగానే తెల్లం వెంకటరావు, సోయం బాపూరావు ఈ అసత్య ఆరోపణలతో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారని ఆరోపించారు. ఈ కుట్రలను ఎదుర్కొనేందుకు లంబాడీలందరూ సంఘటితమై ఐక్యతతో ముందుకు సాగాలని కోరారు. సెప్టెంబర్ 9న నక్కలగుట్టలోని తానా నాయక్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఈ ఆత్మగౌరవ మార్చ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మార్చ్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. లంబాడీ రిజర్వేషన్ పరిరక్షణ జేఏసీ స్టీరింగ్ కమిటీ సమన్వయకర్తలు డాక్టర్ చందు నాయక్, లకావత్ రవీందర్ నాయక్, భూక్య రాజు నాయక్, కెలోతు భిక్షపతి నాయక్, అజ్మీర శ్రీరామ్ నాయక్, వాలు నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు మురళి నాయక్, మోహన్ నాయక్, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు, బంజారా విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలపాలి



**వరంగల్ వాయిస్, నడికూడ:** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నడికుడ మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీ, ఎంపీటీసీ ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితా మరియు పోలింగ్ స్టేషన్ల జాబితాను ఎంపీడీఓ జి. విమల శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముసాయిదా ఓటరు జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 8న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగే సమావేశంలో రాతపూర్వకంగా సమర్పించాలని కోరారు. ఈ అభ్యంతరాలను ఈ నెల 9లోగా పరిష్కరించి, 10న తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ఇనగాల జన్మదిన వేడుకలు

### ◆ కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానుల బైక్ ర్యాలీ
### ◆ రక్తదాన శిబిరం ఏర్పాటు

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్మన్ ఇనగాల వెంకటరామ్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆత్మకూరు మండల కేంద్రంలో అట్టహాసంగా జరిగాయి. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గూడెప్పాడు ఎన్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు "జై ఇనగాల, జై జై ఇనగాల" అంటూ నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం, వెంకటరామ్ రెడ్డి దంపతులు ఆత్మకూరు వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసిన తర్వాత, ఆయన గౌడ కమ్యూనిటీ హాల్‌ను సందర్శించి, నిర్మాణంలో ఉన్న ఎల్లమ్మ గుడి పనులను పరిశీలించారు. అనంతరం, ఎన్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పరకాల నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు ఇనగాలకు శాలువాలు, పూల బొకేలు అందించి జన్మదిన శుభాకాంక్షలు





తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ ఏడుకొండ రవీందర్ గౌడ్, మాజీ సర్పంచ్ నాగేల్లి సామెల్, బరుపట్ల కిరీటి, అయోధ్య, చిమ్మని దేవరాజు, కక్కెళ్ళ రాజు, మార్క్ రజనీకర్ గౌడ్, తనుగుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### ఇనగాలకు శుభాకాంక్షలు తెలిపిన రవీందర్..



ఆత్మకూరు మాజీ సొసైటీ అధ్యక్షుడు ఏరుకొండ రవీందర్, హైదరాబాద్‌లోని వెంకట్రామ్ రెడ్డి నివాసానికి వెళ్లి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఆత్మకూరు ప్రాంతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి ఇనుగాల చేసిన కృషి అపారమని కొనియాడారు. ప్రజల పట్ల ఆయన చూపుతున్న నాయకత్వం, సేవాస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని రవీందర్ పేర్కొన్నారు. ఆత్మకూరు సొసైటీ తరపున, గ్రామ ప్రజల తరపున మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను" అని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సికింద్రాబాద్ పార్లమెంట్ ఇంచార్జి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి అధ్యక్షతన ప్రజాభవన్‌లో కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ పి.విశ్వనాథన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో పార్టీ బలోపేతం, బూత్ స్థాయి కార్యకర్తల సమన్వయం, రాబోయే ఎన్నికల వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో పార్టీని మరింత బలంగా నిలబెట్టేందుకు కృషి చేయాలని నాయకులు సూచించారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ , ఏఐసీసీ సెక్రటరీగా పి. విశ్వనాథన్ బాధ్యతలు చేపట్టి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు జిల్లాల నుండి పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ను కలిసిన నూతన వీపీఓలు



**వరంగల్ వాయిస్, దామెర:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన రెవెన్యూ వ్యవస్థలో భాగంగా, విలేజ్ పంచాయతీ ఆఫీసర్ (విపీఓ)లుగా అర్హులైన వారిని నియమిస్తున్న సందర్భంలో, దామెర మండలంలోని నలుగురు పూర్వపు వీఆర్వోలకు నియామక పత్రాలు లభించాయి. పూర్వపు వీఆర్వోలుగా పనిచేసి ప్రస్తుతం వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న బిస్మాచారి, మోహన్, పాల బిందె రాజు, శంకర్ లకు విపిఓలుగా నియామక పత్రాలు అందాయి. ఈ సందర్భంగా వారు శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ను కలిసి, పూల బొకేను అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కొత్త నియామకంతో వారిలో ఆనందం వెల్లివిరిసింది.

# గంకిడి సుజయ్‌కి ఐటీ నిపుణుల ప్రశంసలు

**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలోని దమ్మన్నపేటకు చెందిన గంకిడి సుజయ్, అంతర్జాతీయ సంస్థ అయిన ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఆడిట్ అండ్ కంట్రోల్ అసోసియేషన్ (ఐఎస్ఏసీఏ) హైదరాబాద్ చాప్టర్ డైరెక్టర్‌గా అందించిన సేవలకు గాను ఐటీ నిపుణుల ప్రశంసలు అందుకున్నారు. శనివారం నాలెడ్జ్ సిటీలో జరిగిన 25వ వార్షికోత్సవ వేడుకలకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ షికా గోయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గంకిడి సుజయ్ హైదరాబాద్ చాప్టర్‌ను విజయవంతంగా నడిపిస్తున్నారని, నూతన టెక్నాలజీతో ఆయన అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అభినందించారు. ఈ సదస్సులో పాల్గొన్న అంతర్జాతీయ నిపుణులు సైతం సుజయ్ కృషిని కొనియాడారు. పలువురి ప్రశంసలు అందుకోవడంతో సుజయ్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.




# ప్రజలు అభివృద్ధికి సహకరించాలి

### ◆ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హసన్‌పర్తి మండలం, మల్లారెడ్డిపల్లె గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామపంచాయతీ మరియు సొసైటీ భవనాల నిర్మాణం కోసం స్థలాలను పరిశీలించారు. తన పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే మొదట అంగన్‌వాడీ స్కూల్‌ను సందర్శించారు. అక్కడ పిల్లల హాజరు పట్టికను, వారికి అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. మౌలిక వసతుల గురించి అంగన్‌వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా అవసరాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం గ్రామంలో రేషన్ పంపిణీ తీరును పరిశీలించడానికి ఆకస్మికంగా రేషన్ షాపులను తనిఖీ చేశారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, వారికి సన్నబియ్యం సరిపడా అందుతున్నాయా, నాణ్యత ఎలా ఉంది అని అడిగారు. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందాలని, ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం



చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆధునిక సదుపాయాలతో కొత్త భవనం నిర్మిస్తామని తెలిపారు. అలాగే, రైతుల ప్రయోజనాల కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) భవనం నిర్మాణానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫీడర్ ఛానల్ వేరుగా అమర్చాలని గ్రామస్తులు కోరగా, వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. గ్రామాన్ని ఒక మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మరో ప్రాజెక్ట్‌కు శ్రీకారం

ఒకవైపు ఆల్కాహాల్ సినిమాను విడుదలకు సిద్ధం చేస్తునే మరో కొత్త సినిమాను ప్రారంభించాడు అల్లరి నటుడు నరేష్. తన కెరీర్‌లో 65వ సినిమాగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్ నేడు పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. ఈ చిత్రం పౌరాణిక హాస్యభరిత కథాంశంతో రూపొందుతున్నట్లు– చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమా ప్రారంభోత్సవానికి పలువురు సినీ ప్రముఖులు హాజరుకాగా.. యువ నటు–డు అక్కినేని నాగ చైతన్య క్లాప్ కొట్టాడు. దర్శకుడు బాబీ కెమెరా స్విచ్ ఆన్ చేయగా.. తొలి షాట్‌కి దర్శకుడు వి.ఐ. ఆనంద్ దర్శకత్వం వహించారు. దర్శకులు వశిష్ట, విజయ్ కుమార్, మరియు రామ్ అబ్బరాజు స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందజేశారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి చంద్రమోహన్ సి దర్శకుడు కాగా, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దంమరియు అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై లెమన్ ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడిగా చైతన్ భరద్వాజ్, ఎడిటర్‌గా ఛోటా కె. ప్రసాద్ వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరికొత్త పాత్రలో కనిపించనున్నట్లు– సమాచారం.






# పుష్ప-3 ఖచ్చితంగా ఉంటుంది

### సైమా వేడుకల వేదికపై సుకుమార్

అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'పుష్ప. అవార్డులు, రివార్డులను సొంతం చేసుకున్న ఈ మూవీ దుబాయ్ వేదికగా జరిగిన 'సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్' సైమా లోనూ సత్తా చాటింది. అత్యధిక నామినేషన్లు దక్కించుకున్న 'పుష్ప 2'.. ఏకంగా ఐదు విభాగాల్లో అవార్డులను సొంతం చేసుకుంది. ఉత్తమ నటుడు (అల్లు అర్జున్), ఉత్తమ నటి (రష్మిక), ఉత్తమ దర్శకుడు (సుకుమార్), ఉత్తమ సంగీత దర్శకుడు (దేవి శ్రీప్రసాద్), ఉత్తమ గాయకుడు (శంకర్ బాబు) విభాగాల్లో 'పుష్ప 2'కు అవార్డులు దక్కాయి. మరోవైపు 'పుష్ప3: ది ర్యాంపేజ్' పేరుతో మూడో భాగం రానున్నట్లు– గతంలో పోస్టర్ విడుదలైన విషయం తెలిసిందే. అయితే, ఆ తర్వాత ఎలాంటి అప్‌డేట్ లేదు. అసలు 'పుష్ప 3' ఉంటుందా.. ఉండదా అన్న అనుమానాలకు సైమా వేదికగా సుకుమార్ క్లారిటీ– ఇచ్చారు. వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'పుష్ప 3' కచ్చితంగా ఉంటుందిగా..' అన్నారు. దీంతో అల్లు అర్జున్ అభిమానులు సంబర పడుతున్నారు. తాజాగా ఉస్తాద్ భగత్ సింగ్‌కు ఒక పాట షూట్ చేశారు. అది విని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. నాకు షేక్‌హ్యాండ్ ఇచ్చి 'అదరగొట్టావ్.. నీ పాటతో చాలా రోజుల తర్వాత నాలో డ్యాన్స్ చేయాలనే కోరిక కలిగించావ్' అని అన్నారు. ఆ మాటకు గాల్లో తేలిపోయానని దేవి శ్రీ ప్రసాద్ అన్నారు. మహేశ్ – రాజమౌళి ప్రాజెక్ట్ (ఎస్ఎస్ఎంబి29) కోసం ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. త్వరగా విడుదలవ్వాలని నేనూ ఎదురుచూస్తున్నా. కానీ మన చేతుల్లో ఏమీ లేదు. అంతా రాజమౌళి చేతుల్లోనే ఉందని సుధీర్ బాబు అన్నారు. నేను ప్రభాస్‌తో చేయనున్న ప్రాజెక్ట్ కోసం అందరూ వేచి ఉండండి. ఆయన డేట్స్ ఇవ్వగానే మొదలు పెట్టేస్తాం. మోక్షజ్ఞతో చేయనున్న సినిమా గురించి నిర్మాతలు ప్రకటించే వరకూ నేను రివీల్ చేయను అని ప్రశాంత్ వర్మ అన్నారు. పెద్ది సినిమా 50 శాతం పూర్తయింది. రామ్ చరణ్ అద్భుతంగా చేశారు ఇప్పటి వరకూ చూడని చరణ్‌ను ఈ సినిమాలో చూస్తారని రత్నవేలు తెలిపారు. నన్ను అభిమానించే ఆడియన్సే నాకు స్ఫూర్తి. నేను ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలో అడుగులు వేస్తున్నాను. మీ అందరి సపోర్ట్ ఎప్పటికీ ఇలానే ఉండాలని కోరుకుంటున్నా. మరింత కష్టపడి పని చేస్తానని మీకు ప్రామిస్ చేస్తున్నానంటూ భాగ్య శ్రీ బోర్సే అన్నాఉ. గతేడాది విడుదలైన సినిమాల్లో నాకు 'హనుమాన్', 'కల్కి 2898 ఏడీ', 'లక్కీ భాస్కర్' నచ్చాయని నిహారిక తెలిపింది.

### అట్టహాసంగా సైమా అవార్డుల వేడుక

సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్' సైమా వేడుక దుబాయ్‌లో అట్టహాసంగా జరుగుతోంది. డ్యాన్స్‌లతో తారలు సందడి చేశారు. 2024 సంవత్సరంలో విశేష ప్రతిభ కనబరిచిన తెలుగు, కన్నడ నటీనటులు అవార్డులను సొంతం చేసుకున్నారు. మొదటి రోజు తెలుగు, కన్నడ చిత్రాలకు అవార్డులు అందజేశారు. 2024 సంవత్సరంలో విశేష ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు పురస్కార ప్రదానం చేశారు. పుష్ప– 2, కల్కిఔశ) చిత్రాలకు నాలుగు విభాగాల్లో అవార్డులు వరించాయి. సైన్స్ ఫిక్షన్ జానర్‌తో తెరకెక్కి ప్రేక్షకుల్ని కొత్త లోకంలోకి తీసుకెళ్లిన 'కల్కి 2898 ఏడీ' ఉత్తమ చిత్రంగా నిలిచింది.

# 'బాహుబలి 2' ఇంటర్వెల్ సీన్ చూసిన తర్వాత భయం వేసింది

### హైప్‌ను క్రియేట్ చేస్తున్న స్పిరిట్

బీజీఎం పనులు దాదాపు 70 శాతం పూర్తి
పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రం 'స్పిరిట్'. ఈ మూవీ ఇంకా సెట్స్‌పైకి వెళ్లకముందే భారీ స్థాయిలో హైప్‌ను క్రియేట్ చేస్తోంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై సందీప్ రెడ్డి స్వయంగా ఒక షాకింగ్ అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఓ టీవీ కార్యక్రమంలో పాల్గొన్న సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. స్పిరిట్ మూవీ షూటింగ్ త్వరలో మొదలవుతుందన్నారు. ఇక ప్రభాస్ గురించి మాట్లాడుతూ.. ప్రభాస్ చాలా నిజాయితీగలవాడు, కోపం లేకుండా పని చేసే వ్యక్తి. స్టార్ అన్న అహంకారం ఆయనలో ఏమాత్రం లేదు. నేను ఊహించిన దానికన్నా ఎక్కువగా ఆయన ఈ సినిమాకు సహకరిస్తున్నారు. త్వరలోనే సెట్స్‌పైకి వస్తాం అని అన్నారు. రామ్ గోపాల్ వర్మ గురించి సందీప్ మాట్లాడుతూ.. ఆయన ఎన్నో విషయాల్లో నాకు గురువు. ఆయన చిత్రాలు చూసి తెలియని విషయాలు నేర్చుకున్నా. 'సత్య' సినిమా 50, 60 సార్లు చూశాను. అది చూసే ఎడిటింగ్ నేర్చుకున్నా అని చెప్పారు. నేను ఇప్పటి వరకూ చూసిన సినిమాల్లో 'బాహుబలి 2' ఇంటర్వెల్ హైలైట్. దానికి మించిన ఇంటర్వెల్ సీన్ ఇప్పటి వరకూ లేదు. అది చూసి నా స్టూడియోకు వచ్చి 'అర్జున్ రెడ్డి' ఇంటర్వెల్ సీన్ చూశాను. ప్రేక్షకులకు నచ్చుతుందా లేదా అని ఒక్క నిమిషం భయం వేసింది. ఇంటర్వెల్ కూడా గొప్పగా ఉండాలని రాజమౌళి నిరూపించారు. 'అర్జున్‌రెడ్డి' –ట్రైలర్ విడుదలయ్యాక ప్రేక్షకుల స్పందన చూసి నాకు ధైర్యం వచ్చిందని చెప్పారు. ఇక 'స్పిరిట్' సినిమాలో ప్రభాస్ రెండు విభిన్న పాత్రల్లో కనిపించ నున్నారని సమాచారం. ప్రస్తుతం ప్రభాస్ ఇతర సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. మారుతి దర్శకత్వంలో చేస్తున్న ది రాజా సాబ్ చిత్రం 2026 సంక్రాంతికి రిలీజ్ కానుంది. మరోవైపు ఫౌజీ (హను రాఘవపూడి డైరెక్షన్‌లో) చిత్ర షూటింగ్ శరవేగంగా సాగుతోంది. 'స్పిరిట్' కోసం సందీప్ రెడ్డి పెట్టిన కండిషన్ ప్రకారం, ప్రాజెక్ట్ ప్రారంభమైన తర్వాత ప్రభాస్ వేరే సినిమా చేయకూడదు. ప్రభాస్ దీనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు– సమాచారం.






# డిజిటల్ రంగంలో అసమానతలు

- స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న మహిళలు 35 శాతం మాత్రమే
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- గోవాలో డిజిటల్ లింగ భేదం, మహిళల ఆర్థికాభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** డిజిటల్ రంగంలో అసమానలతలతో మహిళల ఆర్థిక స్వావలంబన, విద్య, ఆరోగ్య సేవలు పొందడంలో సమస్యలు ఏర్పడుతున్నాయని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలిపారు. గోవా రాష్ట్రంలో ఫ్రిడిక్ ఎబర్ట్ స్టిఫ్టుంజ్ ఇండియా సంస్థ ఆర్గనైజ్ చేసిన సెమినార్‌లో శనివారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గన్నారు. ఈ సందర్భంగా మహిళలు డిజిటల్ ప్రపంచంలో ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళల శక్తి వృద్ధికి అవసరమైన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. చిన్న, మధ్య తరగతి ఆదాయం కలిగిన దేశాల్లో మహిళలు పురుషుల కంటే ఎనిమిది శాతం తక్కువగా మొబైల్ ఫోన్లు కలిగి ఉన్నారని, స్మార్ట్ ఫోన్ వినియోగంలో 13 శాతం తేడా ఉన్నట్లు వివరించారు. 405 మిలియన్ల మంది మహిళలు ఇంకా డిజిటల్ ప్రపంచానికి చేరుకోలేదని, దీని వల్ల మహిళల అభివృద్ధికి పెద్ద ఆటంకమవుతున్నట్లు తెలిపారు. భారతదేశంలో 75 శాతం మహిళలు మాత్రమే మొబైల్ ఫోన్ కలిగి ఉండగా, స్మార్ట్ ఫోన్ వినియోగం కేవలం 35 శాతం మాత్రమే ఉందని వెల్లడించారు. మహిళల పురాతన శక్తి ప్రతీకగా వరంగల్ ప్రాంతంలోని చారిత్రక ఘటనలను వివరించారు. కాకతీయ రాణీ రుద్రమదేవి నాయకత్వం, సమ్మక్క – సారలమ్మ పూజలు వంటి చారిత్రక సంఘటనలతో మహిళల శక్తిని వివరించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం, వడ్డీ రహిత రుణాలు, మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.344 కోట్ల వడ్డీలేని రుణాల విడుదల, ఆరోగ్యసేవలకు రూ.10 లక్షల వరకూ సౌకర్యం, రూ.2,500 నెలకు ఆర్థిక సహాయం వంటి సమర్థమైన పథకాలు అమలు అవుతున్నట్లు వివరించారు. డిజిటల్ రంగంలో మహిళల అసమానతలు తగ్గించేందుకు తక్కువ ధరకే మొబైల్ డివైసులు అందించడం, డిజిటల్ విద్య, మౌలిక సదుపాయాలు పెంపొందించడం అత్యవసరమని వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య అన్నారు. ఈ దిశగా ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం గణనీయమైన కృషి చేస్తున్నదన్నారు. ఈ సదస్సులో మహిళ నాయకులు తమిళనాడు ఎంపీ ఆర్.సుధ, ఎమ్మెల్యే పర్ణికా రెడ్డితోబాటు పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

# బకాయిలపై ఫోకస్

- వర్షాలకు దెబ్బతిన్న సర్వీసుల పునరుద్ధరణ
- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ కార్పొరేట్ కార్యాలయంలో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి శనివారం డైరెక్టర్లు, సీఈ, సీజీఎంలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. కామారెడ్డి, నిజామాబాద్ సర్కిల్ లో భారీ వర్షాలకు దెబ్బతిన్న వ్యవసాయ సర్వీసుల పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సీఈలను ఆదేశించారు. కావలసిన ట్రాన్స్ఫార్మర్లు, పోల్స్, మిగతా మెటీరియల్ అందుబాటులో ఉన్నాయని, ఎటువంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. భారీ వర్షాలు, వరదలకు లెక్కచేయకుండా వాగులు వంకలు దాటుకుంటూ వినియోగదారులకు విద్యుత్ సరఫరా అందించడానికి అహర్నిశలు కృషి చేసిన సిబ్బందికి మెమొంటో, ప్రశంస పత్రాలు ఇవ్వాలని ఆదేశించారు. రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సిస్టం, ఫాల్ట్ ప్యాసేజీ ఇండికేటర్ పనుల పురోగతిపై సమీక్షిస్తూ.. త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. అలాగే ట్రాన్స్ఫార్మర్ల ఫీడర్ మ్యాపింగ్ పనులు వేగంగా చేయాలని అన్నారు. పనుల నాణ్యత పరిశీలించడానికి క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వేగంగా సర్వీసుల మంజూరు చేయడానికి ప్రవేశ పెట్టిన సింగిల్ విండో సిస్టం ద్వారా హెచ్ టి సర్వీసుల మంజూరు త్వరగా చేయాలని అన్నారు. రెండు సంవత్సరాలు పైబడిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ కలెక్షన్స్ పెరగాలని, 100 శాతం నమోదు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాని బకాయిలపై దృష్టి సారించి వసూలు అయ్యేటట్లు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కాలిపోయిన, పని చేయని మీటర్లను తనిఖీ చేసి వెంటనే మార్చాలని కోరారు. హెచ్ టీ సర్వీసుల కలెక్షన్లు కూడా వసూలు అయ్యేటట్లు చూడాలన్నారు. పోల్స్ పై వేసే జరిమానాలను విధిగా వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, సీఈలు టి.సదర్ లాల్, కె.తిరుమల్ రావు, రాజు చౌహన్, అశోక్, వెంకట రమణ, రవీంద్రనాథ్, కె.మాధవ రావు, జీఎంలు వేణుబాబు, కృష్ణ మోహన్, వాసుదేవ్, సత్యనారాయణ, అన్నపూర్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై తక్షణమే స్పందించాలి

- ఆదేశించిన సీపీ సన్ ప్రీత్ సింగ్
- పోలీస్ కంట్రోల్ రూం ఆకస్మిక సందర్శన

**వరంగల్ వాయిస్, క్రైం :** ప్రజలనుంచి వస్తున్న సమస్యలపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం పోలీస్ కమిషనరేట్ లోని కంట్రోల్ రూంను ఆయన సందర్శించారు. ఈ సందర్శనలో కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ కంట్రోల్ రూంలో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడి, అత్యవసర కాల్స్ స్వీకరణ, స్పందన విధానం, డయల్ 100 కార్యకలాపాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి కాల్‌ను అత్యంత జాగ్రత్తగా స్వీకరించాలన్నారు. వాటిపై తక్షణమే స్పందిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా అర్ధరాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించే పోలీస్ అధికారులు సిబ్బందిని సమన్వయం చేస్తూ అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తతో విధులు నిర్వహించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకొని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని కమిషనర్ తెలిపారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా కంట్రోల్ రూం 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు.



# టీఎస్ఈఈయూలో చేరికలు

**వరంగల్ వాయిస్, వడ్డేపల్లి :** విద్యుత్ ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం (327) తోనే లభిస్తుందని రాష్ట్ర సంఘం సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. శుక్రవారం వడ్డేపల్లి రోడ్డులోని సంఘం జిల్లా కార్యాలయంలో టీఆర్ వీకేఎస్ ఎమ్మార్పీ డివిజన్ కార్యదర్శి, అధ్యక్షులు కె.రాజు, పి.సారంగపాణి, శ్రీనివాస్, కమలాకర్, జాకీర్, హరిప్రసాద్, రాజేందర్ లు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘానికి రాజీనామా చేసి తెలంగాణ స్టేట్ ఎంప్లాయిస్ యూనియన్ లో చేరారు. వీరికి ఇనగాల శ్రీధర్ కండువా కప్పి ఆహ్వానించారు. యూనియన్ కంపెనీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, హనమకొండ రీజినల్ సెక్రటరీలు సదయ్య, ఓదెలు, నాయకుడు జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు సంపూర్ణ చంద్ర గ్రహణం
## మూతపడనున్న ఆలయాలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సెప్టెంబర్ 7వ తేదీ రాత్రి 9.58 గంటలకు చంద్ర గ్రహణం ప్రారంభమై అర్ధరాత్రి 1.26 గలకు ముగుస్తుంది. గ్రహణం మొత్తం వ్యవధి 3గంటల 28 నిమిషాలుగా ఖగోళ శాస్త్ర వేత్తలు ప్రకటిస్తున్నారు. గ్రహణ సమయంలో చంద్రుడు ఎర్రగా కనపడతాడని, అందుకే దీనికి బ్లడ్ మూన్ అని పేరు పెట్టారన్నారు. భారత దేశంలో 2022 తర్వాత మళ్లీ ఇప్పుడే సుదీర్ఘ సంపూర్ణ చంద్ర గ్రహనం కనువిందు చేయనుంది. మళ్లీ ఇలాంటి చంద్ర గ్రహనం 2028 డిసెంబర్ 31న సంభవిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సంపూర్ణ చంద్ర గ్రహణాన్ని వీక్షించేందుకు ఎలాంటి సాధనాలు అవసరం లేదని  సైంటిస్టులు తెలిపారు. సంపూర్ణ గ్రహణం రాత్రి 11.01 గంటలనుంచి 12.23 గంటల వరకు మొత్తం 82 నిమిషాల పాటు ఉంటుందని శాస్త్రవెత్తలు ప్రకటించారు.

### ఆలయాల మూసివేత..

సంపూర్ణ చంద్ర గ్రహం నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆలయాలు మూతపడనున్నాయి. గ్రహణవేదను పురస్కరంచుకొని మహా నగరంలోని శ్రీ భద్రకాళీ దేవాలయంలో 7వ తేదీ మధ్యాహ్నం 1 గంట వరకు పూజాదికములన్ని నిర్వర్తించి ఆలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత తెలిపారు. తిరిగి గ్రహణ మోక్షానంతరం ఆలయమందు శుద్ధి సంప్రోక్షణాధికములు నిర్వహించిన అనంతరం 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి భక్తులకు సర్వ దర్శనం, అర్జిత సేవల పునరుద్ధరించనున్నట్లు ఆమె ప్రకటించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com